## అపొస్తలుడైన పౌలు

# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక

ఈ పత్రిక కూడ పౌలు వ్రాసిన పత్రికయే అని చెప్పుటకు ఏ సందేహము లేదు. యౌవనస్థుడైన తిమోతికి జ్ఞానోపదేశమే ఈ పత్రిక ముఖ్యోద్దేశము. సంఘపరిపాలన, సంఘములోని పెద్దలు నియామకము, శారీరిక నిగ్రహము, సంఘములోని వృద్ధులను గూర్చి, వితంతువులను గూర్చి, సంఘస్థుల బాధ్యతను గుర్తుచేయుచు, అబద్ధ బోధకులను గూర్చి కలిగి వుండవలసిన మెలకువలను ఇంకా ఎన్నో సంఘపరమైన విషయములను గూర్చి విపులముగా పౌలు తిమోతికి ఈ పత్రికలో వివరించెను. దీనిని పౌలు మాసిదోనియ నుండిక్రీ॥శ॥ 61-65 సం॥లు మధ్యకాలములో వ్రాసియుండవచ్చును.

**తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక-అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-4 | శుభములు-అబద్ధ బోధలను గూర్చిన హెచ్చరికలు |
| 1:5-11 | ధర్మానుకూలము ఉపయోగించినయెడల ధర్మశాస్త్రము మేలైనది |
| 1:12-17 | దేవుని కృపకై పౌలు కృతజ్ఞత |
| 1:18-20 | విశ్వాసమును మంచి మనస్సాక్షియు కలిగి యుండవలెనని హెచ్చరిక |
| 2:1-7 | బహిరంగ ఆరాధనకైన పద్ధతులు |
| 2:8-15 | స్త్రీ పురుషులు సంఘములోను బయటను ప్రవర్తింప వలసిన విధానము |
| 3:1-7 | సంఘ ఉద్యోగస్తులు |
| 3:8-13 | పరిచారకులు-పరిచర్యచేయు స్త్రీలు ప్రవర్తింప వలసిన విధానము |
| 13:14-16 | సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై ఉన్నది |
| 4:1-5 | అబద్ధ బోధకులతో నడుచుకొను విధము |
| 4:6-15 | తిమోతి బ్రతుకును, ఆయన బోధను గూర్చిన హెచ్చరిక |
| 5:1-2 | సంఘములోని వృద్ధులను విధవ రాండ్రను పరామర్శించుట |
| 5:3-8 | విధవరాండ్రను సన్మానింపుము |
| 5:9-16 | అనాధలైన విధవరాండ్రకు సహాయము చేయుట |
| 5:17-25 | సంఘ పెద్దలు |
| 6:1-2 | దాసత్వమను కాడిక్రింద ఉన్నవారు |
| 6:3-5 | భిన్నమైన బోధనుపదేశించిన వాడేమియు ఎరుగక గర్వాంధుడగును |
| 6:6-10 | సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనము |
| 6:11-16 | తిమోతి కొరకైన పౌలు హెచ్చరికలు |
| 6:17-21 | ధనవంతులైన వారు దేవుని యందే నమ్మిక ఉంచవలెను |

---------------------------------------------------------------

# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 1వ అధ్యాయము

### శుభము – అబద్ధ బోధలను గూర్చిన హెచ్చరికలు

మన రక్షకుడైన దేవుని యొక్కయు, మన నిరీక్షణయైన క్రీస్తుయేసు యొక్కయు ఆజ్ఞ ప్రకారము క్రీస్తుయేసు
యొక్క అపొస్తలుడైన పౌలు 2 విశ్వాసమును బట్టి నా నిజమైన కుమారుడగు తిమోతికి శుభమని చెప్పి
వ్రాయునది. తండ్రియైన దేవుని నుండియు, మన ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కృపయు, కనికరమును
సమాధానమును నీకు కలుగును గాక. 3 నేను మాసిదోనియకు వెళ్ళుచుండగా సత్యమునకు భిన్నమైన బోధలు
చేయవద్దనియు, కల్పనా కథలను మితము లేని వంశావళులను, 4 విశ్వాస సంబంధమైన దేవుని ఏర్పాటుతో
కాక వివాదములతోనే సంబంధము కలిగియున్నవి కనుక వాటిని లక్ష్యపెట్టవద్దనియు, కొందరికి
ఆజ్ఞాపించుటకు నీవు ఎఫెసులో నిలిచి యుండవలెనని నిన్ను హెచ్చరించిన ప్రకారము ఇప్పుడును
హెచ్చరించుచున్నాను.

5 ఉపదేశసారమేదనగా పవిత్ర హృదయమునుండియు, మంచి మనస్సాక్షి నుండియు, నిష్కపటమైన
హృదయమునుండియు కలుగు ప్రేమయే. 6 కొందరు వీటిని మానుకొని, తొలగిపోయి తాము చెప్పువాటినైనను,
నిశ్చయమైనట్టు రూఢిగా పలుకు వాటినైనను గ్రహింపక పోయినను, 7 ధర్మశాస్త్రోపదేశకులై యుండగోరి
నిష్ప్రయోజనమైన ముచ్చటలకు తిరిగిరి. 8 అయినను శ్రీమంతుడగు దేవుడు నాకు అప్పగించిన ఆయన
మహిమగల సువార్త ప్రకారము, 9 ధర్మశాస్త్రము ధర్మవిరోధులకును అవిధేయులకును, భక్తిహీనులకును
పాపిష్టులకును అపవిత్రులకును, 10 మతదూషకులకును పితృహంతకులకును మాతృహంతకులకును
నరహంతకులకును వ్యభిచారులకును పురుష సంయోగులకును మనుష్యచోరులకును అబద్ధికులకును, 11
అప్రమాణికులకును, హితబోధకు విరోధియైనవాడు మరి ఎవడైనను ఉండిన యెడల అట్టివానికిని
నియమింపబడెను గాని నీతిమంతునికి నియమింపబడలేదని ఎవడైనను ఎరిగి, ధర్మానుకూలముగా దానిని
ఉపయోగించిన యెడల ధర్మశాస్త్రము మేలైనదని మనమెరుగుదుము.

### దేవుని కృపకై పౌలు కృతజ్ఞత

12 పూర్వము దూషకుడను హింసకుడను హానికరుడనైన నన్ను, 13 తన పరిచర్యకు నియమించి
నమ్మకమైన వానిగా ఎంచినందుకు నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తుయేసుకు కృతజ్ఞుడనైయున్నాను.
తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపబడితిని. 14 మరియు మన ప్రభువు యొక్క కృపయు,
క్రీస్తు యేసునందున్న విశ్వాసమును ప్రేమయు అత్యధికముగా విస్తరించెను. 15 పాపులను రక్షించుటకు
క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై
యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను. 16 అయినను నిత్య జీవము నిమిత్తము తనను విశ్వసింపబోవు
వారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధాన పాపినైన
నాయందు కనబరచునట్లు నేను కనికరింపబడితిని. 17 సకలయుగములలో రాజైయుండు అక్షయుడును
అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక, ఆమేన్.

18 నా కుమారుడవైన తిమోతీ, నీవు విశ్వాసమును మంచి మనస్సాక్షియు కలిగిన వాడవై నిన్ను
గూర్చి ముందుగా చెప్పబడిన ప్రవచనములు చొప్పున ఈ మంచి పోరాటము పోరాడవలెనని వాటిని బట్టి ఈ
ఆజ్ఞను నీకు అప్పగించుచున్నాను. 19 అట్టి మనస్సాక్షిని కొందరు త్రోసివేసి విశ్వాస విషయమై ఓడ
బద్దలైపోయినవారివలె చెడియున్నారు. 20. వారిలో హుమెనైయను, అలెక్సంద్రును ఉన్నారు వీరు
దూషింపకుండ శిక్షింపబడుటకై వీరిని సాతానుకు అప్పగించితిని.